విశాఖపట్టణం
గురువారం 15 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 244 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

వేదాశీర్వచనం చేసిన అర్చకులు

2



# మోగిన నగారా..

### 28న మున్సిపోల్స్... 30 ఫలితాలు లెక్కింపు

### 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాల్టీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు

### రెండో దశలో నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

### షెడ్యూల్ ను విడుదల చేసిన ఎస్ ఈసీ అనిల్ చంద్ర పునేఠా

(అమరావతి - జయజయహే)

ఎంతగానో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరశంఖం మోగింది. రాష్ట్రంలో పురపాలక, మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేశారు. నోటిఫికేషన్ వెలువడిన క్షణం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని ఎస్‌ఈసీ స్పష్టం చేసింది. అంటే ఇప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంది. పట్టణ ప్రాంతాల నుంచి పల్లెల వరకు వివిధ దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

**మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల షెడ్యూల్**

మొదటి దశలో భాగంగా రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల స్వీకరణ గడువు అక్టోబర్ 18 వరకు ఉంటుంది. నామినేషన్ల పరిశీలన 19, ఉపసంహరణకు తుది గడువు ఈ నెల 21 ఉండగా.. పోలింగ్ అక్టోబర్ 28వ తేదీన జరుగుతుంది. ఓట్ల లెక్కింపు, ఫలితాలు 30వ తేదీన ప్రకటిస్తారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్**

రెండో దశ కింద ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 19న వస్తుంది. నామినేషన్ల తుది గడువు 23, నామినేషన్ల ఉపసంహరణ 27 వరకు ఉంటుంది. పోలింగ్ తేదీ నవంబర్ 3 ఉండగా.. ఫలితాలు నవంబర్ 5న వెల్లడిస్తారు.

**మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు**

గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం మూడు విడతల్లో పంచాయతీ

..మిగతా 2లో






### జనసేనలో చేరిన

## వంగవీటి రాధా

### కండువా కప్పి అహ్వానించిన పవన్ కల్యాణ్

### విజయవాడ మేయర్ సీటు కోసమేనా?

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ బుధవారం జనసేన పార్టీలో చేరారు. ఆయనతో పాటు తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేన కండువా కప్పుకున్నారు. రాజధాని అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ మేయర్ రేసులో వంగవీటి రాధాకృష్ణ, తిరుపతి మేయర్ రేసులో ప్రణీత్ ప్రమోద్ జనసేన అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరుబోతున్నారని నిన్నటి నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విజయవాడలో పలుచోట్ల ఫ్లెక్సీలు సైతం కనిపించాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రాధాకృష్ణ జనసేనలో చేరారు. మొన్నటివరకూ

..మిగతా 2లో

# సీట్ల సర్దుబాటు కుదిరింది

### ఏకభిప్రాయానికి వచ్చిన కూటమి పార్టీలు

### గెలుపే లక్ష్యమంటూ కూటమి పార్టీలు ప్రకటన

### క్యాడర్ సంతృప్తి పడేలా ఎన్నికల్లో పోటీ చేస్తాం

### రెండు రోజుల్లో అభ్యర్థుల ప్రకటన

### జనసేన ఎమ్మెల్యే వంశీకష్ణ ప్రకటన

(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు సఫలం అయ్యాయి. ఈ మేరకు 2024 ఎన్నికల మాదిరిగానే.. స్థానికసంస్థల ఎన్నికల్లోనూ ఈ పార్టీలు కలిసి పోటీ చేయబోతున్నాయి. జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి మీడియాతో మాట్లాడారు. 'కూటమి పార్టీల్లో ఎలాంటి విభేదాలు లేవు. 2024లో కూటమి తరహాలోనే స్థానిక ఎన్నికలకు పోటీచేస్తాం. కూటమి సీట్ల సర్దుబాటుపై చర్చలు కొలిక్కి వచ్చాయి. ఎవరికి బలమున్న చోట వారు పోటీ చేస్తారు. సింగిల్ ఎజెండాతో కూటమిగానే పోటీలోకి దిగనున్నాం. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా ఎన్నికల్లో

..మిగతా 2లో



### మూసీ పునరుజ్జీవానికి...

## ఏడీబీ ఆమోదం

### రెండు ప్యాకేజీల్లో రూ.7,345 కోట్ల అంచనాతో పనులు

### తొలి దశలో 21 కి.మీ. టెండర్ల ప్రక్రియ ప్రారంభం

### టెండర్ల దాఖలుకు నవంబర్ 26 తుది గడువు

### నది ప్రక్షాళన, సుందరీకరణతో పాటు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం

### మొత్తం 55 కిలోమీటర్ల ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4,500 కోట్ల రుణం

### ఔటర్ రింగ్ రోడ్‌పై ఒక ఐకానిక్ కేబుల్ స్టేడ్ బ్రిడ్జి నిర్మాణం



2



### బ్లూడ్రమ్ కేసులో

## సంచలన తీర్పు

### సౌరభ్ రాజ్ పుత్‌ను హత్య చేసి భార్య, ఆమె ప్రియుడు

### శవాన్ని 15 ముక్కలుగా నరికి డ్రమ్ లో దాచిన దండుగులు

### భార్య ముస్కాన్‌కు, ప్రియుడు సాహిల్‌కు ఉరిశిక్ష

### మీరట్ కోర్టు సంచనలన శిక్ష

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో భర్తను హత్య చేసి.. శవాన్ని 15 ముక్కలుగా నరికి.. డ్రమ్‌లో దాచిన కేసులో మీరట్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దేశవ్యాప్తంగా కలకలం రేపిన మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్

..మిగతా 2లో

# జగన్‌కు చిక్కులు

### అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణ

### సీబీఐ కోర్టు కీలక నిర్ణయం.. పదేళ్లుగా 9 ఈడీ చార్జిషీట్లు పెండింగ్

### ఇక విచారణ వేగవంతానికి చర్యలు




(హైదరాబాద్ - జయజయహే)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు నిర్ణయించింది. సీబీఐ కేసులతోపాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని స్పష్టం చేసింది. రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ లాయర్లకు సైతం సూచించింది. సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్లో ఉన్నాయని, వాటితో పాటు డిశ్చార్జి పిటిషన్లు సైతం తేలకపోవడంతో ఈడీ కేసుల విచారణ ముందుకు సాగడం లేదని తెలిసిందే. ఈ పరిణామాలతో ఈడీ కేసులను రోజువారీగా విచారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటివరకు ప్రధానంగా సీబీఐ కేసులనే కోర్టు విచారిస్తూ వస్తోంది. దీంతో తమ కేసులను కూడా విచారించాలని, కేసు త్వరగా తేలేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఈడీ పిటిషన్ వేసింది. ఈ

..మిగతా 2లో




2

## 130 కోట్లు ఆస్తులు జప్తు

### కల్తీ నెయ్యి కేసులో ఈడీ చర్యలు

### శ్రీ వైష్ణవి, భోలేబాబా, సుకృతి ఫుడ్స్ సంస్థలు ఆస్తులు సీజ్

# బ్లూడ్రమ్ కేసులో సంచలన తీర్పు



మొదటి పేజీ తరువాయి...

హత్య కేసులో అతడి భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు ఉరిశిక్ష విధించింది. వెయ్యి పేజీల ఛార్జ్‌షీట్, సాక్షుల వాంగ్మూలాలు, సుదీర్ఘ విచారణ తర్వాత కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. 2025 జూలైలో ప్రారంభమైన ఈ కేసు విచారణ దాదాపు 13 నెలల పాటు సాగింది. ప్రస్తుతం నిందితులు ఇద్దరు మీరట్‌లోని చౌదరి చరణ్ సింగ్ జైలులో ఉన్నారు. సెప్టెంబర్ 30న వారిని దోషులుగా నిర్ధారించిన కోర్టు ఇవాళ తీర్పును వెలువరించింది.

గత ఏడాది మార్చిలో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. భార్య ముస్కాన్‌కు సాహిల్ శుక్లాతో వివాహేతర సంబంధమే ఈ దారుణానికి కారణమని దర్యాప్తులో వెల్లడైంది. పక్కా ప్లాన్‌తో సౌరభ్‌ను హత్య చేసిన నిందితులు.. మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికి ప్లాస్టిక్ డ్రమ్‌లో వేసి, సిమెంట్‌తో సీల్ చేశారు. సాక్ష్యాలు లేకుండా చేసి తప్పించుకోవాలని చూసినా.. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. చివరకు నిందితులు కటకటాల వెనక్కి వెళ్లక తప్పలేదు. సౌరభ్, ముస్కాన్ 2016లో లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. 2019లోనే వారికి ఒక కుమార్తె కూడా పుట్టింది. ఆ తర్వాత ముస్కాన్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. ముస్కాన్ తన లవర్ సాహిల్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సౌరభ్కు తెలిసింది. దాంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలోనే మార్చి 4న సౌరభ్ తినే ఆహారంలో ముస్కాన్ నిద్రమాత్రలు కలిపింది. ఆపై సాహిల్, ముస్కాన్ కలిసి సౌరభ్ను కత్తితో పొడిచి చంపారు. డెడ్ బాడీని 15 ముక్కలుగా కోసి, డ్రమ్ములో వేసి, సిమెంటుతో సీల్ చేశారు.

హత్య చేసిన మరుసటి రోజే నిందితులు హిమాచల్ ప్రదేశ్ కు పారిపోయారు. రాజ్‌పుత్ బతికే ఉన్నాడని, వ్యాపార పని మీద ప్రయాణం చేస్తున్నాడని నమ్మించేలా ముస్కాన్ అతని మొబైల్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సందేశాలు పంపింది. అయితే సౌరభ్ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 2025 మార్చి 17న ఇంటిని తనిఖీ చేయగా సిమెంట్ తో సీల్ చేసిన బ్లూడ్రమ్ దొరికింది. అనుమానం రావడంతో పగలగొట్టి చూడగా సౌరభ్ శరీర భాగాలు కనిపించాయి. దీంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పపించారు. ఇటీవల ముస్కాన్ ఆడబిడ్డకు జైల్లోనే జన్మనిచ్చింది. ఈమెకు ఆరేళ్ల పాప కూడా ఉంది. 126 కోర్టు విచారణలు, 22 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత మీరట్ జిల్లా కోర్టు వారికి కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. మీరట్ జిల్లా కోర్టు తీర్పుపై నిందితులు హైకోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.



## మోగిన నగారా..

మొదటి పేజీ తరువాయి...

పోలింగ్ నిర్వహించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ పూర్తయిన రోజు సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

**తొలి విడత**

నోటిఫికేషన్: నవంబరు 13
నామినేషన్ల గడువు: నవంబరు 17 (ఉపసంహరణ: నవంబరు 21)
పోలింగ్ ¸ లెక్కింపు: నవంబరు 26

**రెండో విడత**

నోటిఫికేషన్: నవంబరు 18
నామినేషన్ల గడువు: నవంబరు 20 (ఉపసంహరణ: నవంబరు 24)
పోలింగ్ ¸ లెక్కింపు: నవంబరు 29

**మూడో విడత**

నోటిఫికేషన్: నవంబరు 19
నామినేషన్ల గడువు: నవంబరు 23 (ఉపసంహరణ: నవంబరు 27)
పోలింగ్ ¸ లెక్కింపు: డిసెంబరు 2

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అవసరమైన భద్రతా చర్యలను సిద్ధం చేస్తున్నాయి.

## సీట్ల సర్దుబాటు కుదురింది

మొదటి పేజీ తరువాయి...

పోటీ చేస్తాం. ఎలాంటి పర్సంటేజీల కోసం చర్చించలేదు. సీట్ల రేషియో కాదు.. గెలుపే లక్ష్యంగా కూటమి పార్టీలు పనిచేస్తాయి. రెండు రోజుల్లో జనసేన అభ్యర్థులను ప్రకటిస్తాం. పార్టీ పరంగా కాకుండా.. కూటమి పరంగా అభ్యర్థులను ప్రకటిస్తాం' అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. జనసేన పార్టీ నేత పవన్ కల్యాణ్ చెప్పినట్లు కేడర్ సంతృప్తి చెందేలా స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని పేర్కొన్నారు. ఎవరు ఎక్కడ పోటీ చేయాలనే క్లారిటీ కూటమి పార్టీలకు ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రం బాగు కోసం జనసేన కట్టుబడి ఉందని వంశీకృష్ణ పేర్కొన్నారు.



## జనసేనలో చేరిన వంగవీటి రాధా

మొదటి పేజీ తరువాయి...

రాధాకృష్ణ సతీమణికి జనసేన నుంచి విజయవాడ మేయర్ గా ఛాన్స్ ఇస్తారని చర్చ జరిగింది. అయితే విజయవాడ మేయర్ పదవి అన్ రిజర్వ్‌డ్‌గా ప్రకటించడంతో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు మొత్తం 123 ఉండగా.. నేడు 100 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వంగవీటి రాధాకృష్ణ ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన 2004లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 లో ప్రజారాజ్యం పార్టీలో చేరగా, 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన టీడీపీలో చేరిన ఆయన అదే పార్టీలో కొనసాగారు. అయితే విజయవాడ నగర మేయర్ స్థానం అన్‌రిజర్వుడ్‌గా కేటాయించడం, కూటమి పొత్తుల్లో భాగంగా ఈ మేయర్ పీఠాన్ని జనసేనకు కేటాయిస్తారనే నడిచింది. దాంతో వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారని విజయవాడలో, అటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం చంద్రబాబుతో జనసేన పార్టీ అగ్రనేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొని సీట్ల కేటాయింపు, పోటీ చేసే స్థానాలపై సుదీర్ఘంగా చర్చించారు.



## దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**వేదాశీర్వచనం చేసిన అర్చకులు**



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

విజయవాడ శ్రీ కనకదుర్గమ్మను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా ఇంద్రకీలాద్రికి వచ్చిన రాష్ట్రపతి కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ పాలకమండలి తరఫున ఘనస్వాగతం లభించింది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా గాంధీ, ఆలయ అధికారులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఆలయ సాంప్రదాయాల ప్రకారం అత్యంత వైభవంగా స్వాగతం పలికారు. స్వాగత సత్కారాల అనంతరం రాష్ట్రపతి ఆలయ అంతరాలయంలోకి వెళ్ళి శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. దేశ శ్రేయస్సు, ప్రజల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అర్చనలు, పూజలు జరిపించారు. దర్శనం అనంతరం రంగమండపంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్చారణలు, దివ్య ఆశీర్వచనాలతో రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి రాష్ట్రపతికి అమ్మవారి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి కొండపైన, కొండ కింద ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ మళ్లింపులు, పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. 'విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా పండితులు రాష్ట్రపతికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి ప్రసాదాలను సమర్పించారు.' అని హోంమంత్రి అనిత సోషల్ మీడియాలో ఫోటోలు పోస్ట్ చేశారు.



## మూసీ పునరుజ్జీవానికి... ఏడీబీ ఆమోదం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

నగరాన్ని సుందరంగా మార్చే మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి అనుమతులు రావడంతో, తొలి దశ పనులకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులను రెండు ప్యాకేజీల కింద చేపట్టనున్నారు. ఎంఆర్‌డీసీఎల్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అక్టోబరు 15 నుంచి టెండర్ పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. టెండర్లు దాఖలు చేయడానికి నవంబర్ 26ని చివరి తేదీగా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి అర్హత కలిగిన సంస్థను ఎంపిక చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మొదటి దశ పనుల కోసం రూ.7,345 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా, జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఈసా నదిపై 9.8 కి.మీ., జోన్-1బీ కింద గండిపేట నుంచి బాపుఘాట్ వరకు మూసీపై 11.2 కి.మీ. మేర అభివృద్ధి పనులు చేపడతారు. నది ప్రక్షాళన, వరద నివారణకు రిటైనింగ్ గోడల నిర్మాణం, సుందరీకరణ, రోడ్లు, బ్రిడ్జిలు, రబ్బర్ డ్యామ్‌లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్‌పై ఒక ఐకానిక్ కేబుల్ స్టేడ్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మొత్తం 55 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4,500 కోట్ల వరకు రుణం అందించనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. డిసెంబర్ 2027 నాటికి తొలి దశ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, పరిహారంపై కొందరు స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు వేగవంతం కానున్నాయి.

## 130 కోట్లు ఆస్తులు జప్తు

**కల్తీ నెయ్యి కేసులో ఈడీ చర్యలు**

**శ్రీ వైష్ణవి, భోలేబాబా, సుకృతి ఫుడ్స్ సంస్థలు ఆస్తులు సీజ్**

**(హైదరాబాద్ - జయజయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కల్తీ నెయ్యి కేసు దర్యాప్తులో భాగంగా శ్రీవైష్ణవి డెయిరీ, భోలేబాబా, సుకృతి ఫుడ్స్ సంస్థలకు చెందిన సుమారు రూ.130 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ఆయా సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాశ్ చంద్ర మంగ్లాతో పాటు వారి కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులపై సైతం మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు చేపట్టారు. ఈడీ జరిపిన సమగ్ర దర్యాప్తులో భోలేబాబా సంస్థ టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు తేలింది. ఈ అక్రమాలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన ఈడీ, రూ.2.7 కోట్ల నగదు సీజ్ చేయడంతో పాటు బ్యాంకు అకౌంట్‌లను సైతం ఫ్రీజ్ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన విపిన్ జైన్, కైలాశ్ చంద్ర మంగ్లాలను ఈడీ అధికారులు ఇదివరకే అరెస్టు చేయడం తెలిసిందే.

## జగన్‌కు చిక్కులు

మొదటి పేజీ తరువాయి...

క్రమంలో స్పందించిన సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సోమవారం నుంచి ఈడీ కేసులను సీబీఐ కోర్టు వరుసగా రోజువారీ ప్రాతిపదికన విచారించే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈడీ పిటీషన్‌ను స్పందిస్తూ మాట్లాడారు. జగన్ పై కేసులను రోజువారీగా కాదు, రోజు మొత్తం విచారణ చేపట్టేలా కోర్టులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానులు, ఉప ప్రధానుల మీద నమోదైన కేసుల్లోనే కేవలం 3 ఏళ్లలో తీర్పులు వచ్చాయని గుర్తుచేశారు. వీపీ సింగ్, పీవీ నరసింహారావుల మీద నమోదైన కేసుల్లోనే తక్కువ సమయంలోనే తీర్పులు వచ్చాయని, కానీ జగన్ అంతకంటే గొప్ప వ్యక్తా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి విచారణే ప్రారంభం కాని కేసులు ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా కేసుల విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ ఓ టర్మ్ సీఎంగా సైతం చేశారని.. కనుక సీబీఐ, ఈడీ రోజువారీ కాదు రోజుమొత్తం జగన్ కేసులపై విచారణ చేపట్టి వాస్తవాలు తేల్చాలన్నారు.

# సమూలాల మార్పులతో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

**- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి**

**- దేవరాపల్లిలో రూ. 2.5 కోట్లతో నిర్మించిన కేజీబీవీ టైప్ -4 భవనం ప్రారంభం**

**- 35 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

**దేవరాపల్లి, అక్టోబర్ 14, జయ జయహే : సమూలమైన మార్పులతో**





ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బాలికల విద్య, పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని కాశీపురంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను మాడుగుల ఎమ్మెల్యే బండారు బుధవారం ప్రారంభించారు. ఇప్పటివరకు బస్సుల కోసం ఎండలో, వర్షంలో నిరీక్షిస్తూ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు ఈ షెల్టర్‌తో పరిష్కారం లభించనుందని ఆయన అన్నారు. కాశీపురంతో పాటు చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలకు ఇది ప్రయోజనకరంగా ఉండనుందన్నారు . అనంతరం దేవరాపల్లి హైస్కూల్ ప్రాంగణంలో సమగ్ర శిక్ష నిధులు రూ.2.05 కోట్లతో నిర్మించిన టైప్-4 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జీసీడీవో జమీమా, డీఈవో నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ భవనంలో 100 మంది బాలికలకు వసతి కల్పించేలా 15 డార్మెటరీ గదులు, డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో బాలికల విద్యావసరాల కోసం నాలుగు టైప్-4 కేజీబీవీలను అందుబాటులోకి తెచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానికంగా తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినులు ఈ వసతి సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాడుగుల నియోజకవర్గానికి చెందిన 35 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.15.44 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనారోగ్య బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగడంపై చర్చించారు. సమన్వయంతో పనిచేయాలని కూటమి శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష ఈఈ నరసింహారావు, డిఈ గణేష్, తహసీల్దార్ పి. లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, టిడిపి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, ఆవుగడ్డ సత్యవేణి, రొంగలి మహేష్, చల్లా సత్యనారాయణ, పైలా అమ్మాజీ, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, బండారు రామారావు, పూడి సత్యారావు, తెలుగు యువత మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి నాయుడు, శరఖాన సూర్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు, రెడ్డి బలరాం, పెనగంటి సింహాచలం నాయుడు, చల్లా తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.



## పతకాలే లక్ష్యం.. అంతర్జాతీయమే గమ్యం!

**రాజమహేంద్రవరం జయ జయహే : అక్టోబర్14:**

రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో సత్తాచాటిఅంతర్జాతీస్థాయికి ఎదగాలని పలువురు వక్తలు క్రీడాకారులకుపిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని చెరుకూరివీర్రాజు--సుబ్బలక్ష్మి కన్వెన్షన్ హాల్లోతూర్పుగోదావరి జిల్లా వుషు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 12వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ వుషుఛాంపియన్‌షిప్ (బాలురు, బాలికలు) పోటీలుప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పోటీలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ వుషు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ఆదిశేషుమాట్లాడుతూ, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి నవంబర్ 2 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీనియర్ విభాగంలో డిసెంబర్ 8 నుంచి 14 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వుషు క్రీడను మరింత అభివృద్ధి చేసి, హర్యానా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు దీటుగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా వుషు అసోసియేషన్ అధ్యక్షుడు అజ్జరపు వాసు మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సుందరం మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, రెండు రోజులపాటు 20 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి. నరసింహారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు టి. శ్రీనివాసరావు, ఆర్. శివకుమార్, రాష్ట్ర కోశాధికారి కె. వెంకటేష్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై పోరుబాటలో వైసిపి

**సూపర్ సిక్స్ అమలుకు ఒత్తిడి తెస్తాం: మార్గాని భరత్ రామ్**

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 14:**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసిపి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్గాని భరత్ రామ్ ప్రజలకు పిలుపునిచ్చారు. వైసీపీకి ప్రజలు మద్దతు ఇస్తే కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయిస్తామని అన్నారు. వీఎల్ఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ వైసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 'ఎన్డీఏ ఎమ్మెల్యే రెండున్నరేళ్ల పాలనపై ప్రజా చార్జ్‌షీట్', 'ఆదిరెడ్డి ఫ్యామిలీ ప్యాక్' గోడపత్రికలనుఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. నగరంలో గతంలో తాను ఎంపి గా ఉన్న సమయంలోనే పలు అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. తూర్పు కాపులు, ఎస్సీలు, పద్మశాలీలు, యాదవులు, శ్రామిక వర్గాల కోసం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించి, ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు ఇచ్చినా పనులు ముందుకు సాగలేదన్నారు. ఆయా సామాజిక వర్గాల నాయకులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. నగరంలో పేదలకు మంజూరైన 25 వేల ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపించే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులకు ఇళ్ల నిర్మాణం కోసం పీఎంఏవై పథకం కింద అందాల్సిన సాయం అందించాలని డిమాండ్ చేశారు. పట్టాలు దొంగవని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే వాటిని నిరూపించాలని సవాల్ విసిరారు. నగరంలో ఇసుక, మద్యం మాఫియా, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు, బ్రాకెట్ జూదానికి అధికార పార్టీ నేతలు అండగా ఉంటున్నారని మార్గాని ఆరోపించారు. మాజీ డిప్యూటీ మేయర్ కుమారుడు ఇళ్లకు వెళ్లి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనివిమర్శించారు. రాజమహేంద్రవరం నగర సంస్కృతి, ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఆదిరెడ్డి కుటుంబానికి చెందిన పలువురు గత 19 ఏళ్లుగా వివిధ పదవుల్లో ఉన్నప్పటికీ నగరానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. తాను ఎంపిగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఆధారాలు, నిధుల మంజూరు వివరాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై వైసిపి పోరాటానికి అందరూ కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు అజ్జరపు వాసు, దాసి వెంకట్రావు, రావిపాటి రామచంద్రరావు, పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, సంకిస భవానీ ప్రియ, కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ..

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 15,**

కొయ్యూరు మండలంలో వాటర్ షెడ్ పీడీ, డబ్ల్యూపీఓ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు, మందు పిచికారీ పంపులను పాడేరు నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, గిరిజన రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. వాటర్ షెడ్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ సిబ్బంది, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ సీఎం బూడికి మాతృవియోగం

**దేవరాపల్లి, అక్టోబర్ 14, జయ జయహే :**



మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్సీపీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బూడి ముత్యాలనాయుడుకు మాతృ వియోగం కలిగింది. ముత్యాలనాయుడు మాతృమూర్తి బూడి అమ్మనమ్మ (88) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తారువలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. దీంతో మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు ఇంట విషాదం నెలకొంది. మాతృమూర్తి పార్థివ దేహం వద్ద ముత్యాలనాయుడు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీంత స్వగ్రామం తారువలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. ముత్యాలనాయుడు మాతృమూర్తి అమ్మనమ్మ మృతి పట్ల పలువురు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయుకులు, కార్యకర్తలు,

**అధికార్లు సంతాపం వెలిబుచ్చారు.**

అమ్మనమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతున్నట్లు ప్రకటించారు. గురువారం తారువ గ్రామంలో ఉదయం 10 గం లకు అమ్మనమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## క్యాన్సర్ బాధితురాలికి రూ.25 వేల ఆర్థిక సాయం

**దేవరాపల్లి, అక్టోబర్ 14, జయ జయహే**

దేవరాపల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలుపసుమర్తి సరోజకు చైతన్య గొంప ఛారిటీ ట్రస్ట్ తరఫున రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. వైద్య ఖర్చులకోసం ఇబ్బందులు పడుతున్న ఆమెకు బుధవారం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్లేటి కరుణాకరరావు (మహేశ్వరి నాయుడు) చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లెదేముళ్లు, సత్తిబాబు మాస్టారు, రొంగలి గోవిందమ్మ, సత్తిరాజు, చెంబూరి మురళి కృష్ణ (బాబ్జి ), జాన దేముడమ్మ, కొరువాడ శివ తదితరులు పాల్గొన్నారు.



## టెక్కలి ఎంపీటీసీ జడ్పిటిసి రిజర్వేషన్లు ఖరారు

**ప్రజా తీర్పుకు సిద్ధమవుతున్న ప్రతినిధులు**

**టెక్కలి అక్టోబర్ 14 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా గ్రామస్థాయి ప్రజాపాలన నాయకత్వానికి అన్ని రాజకీయ పార్టీలు తమ వ్యక్తులను సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ తరుణంలో టెక్కలి ఎంపీటీసీ, జడ్పిటిసి, రిజర్వేషన్లు ఖరారు చేశారు, టెక్కలి జెడ్పిటిసి స్థానాన్ని ఎస్సీకి కేటాయించారు, ఎంపీటీసీ స్థానాలు ఇ లా ఉన్నాయి, టెక్కలి 1 జనరల్. టెక్కలి 2 బీసీ మహిళ. టెక్కలి 3,4, జనరల్ మహిళ. టెక్కలి 5,6, బీసీలు. టెక్కలి 7 జనరల్ మహిళ. టెక్కలి 8 ఎస్టి. అక్కవరం ఎస్సీ మహిళ. చాకిపల్లి ఎస్సీ. తలగాం, రావివలస, అయోధ్య పురం, బీసీ మహిళ. పాత నౌపడ, పోలవరం జనరల్ మహిళ. బూరగాం తొలిచూరిపల్లి ,నర్సింగపల్లి 'లింగాల వలస ,మేఘవరం, పంచాయితీలు జనరల్ కి కేటాయించారు. ఇక అభ్యర్థుల జాతకాలు ఓటర్ల చేతుల్లో ఉన్నాయి.



## వార్డుల విభజనలో పారదర్శకతేదీ?

**కొంతమూరు, కోలమూరు, రాయుడుపాక విలీనానికి డిమాండ్**

**రాజమహేంద్రవరం: జయజయహే :అక్టోబర్ 14:**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 72 డివిజన్ల పునర్వ్యవస్థీకరణను శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలని సిపిఎం, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడారు. ప్రతి డివిజన్‌కు సంబంధించిన మ్యాపులు, వీధుల సరిహద్దులు, డోర్ నంబర్లు, జనాభా, ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్, కాంగ్రెస్ జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ కోరారు. ఈ నెల 8న సీపీఎం అభ్యంతరాలు తెలిపినా పూర్తి సమాచారం అందలేదని పేర్కొన్నారు. అన్ని పార్టీలకు వివరాలు అందించి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. నగరానికి ఆనుకుని ఉన్న కొంతమూరు, కోలమూరు, రాయుడుపాక గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరారు. నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాలను కలిపి, సమీప గ్రామాలను మినహాయించడం సరైన విధానం కాదన్నారు. గోదావరి పుష్కరాల దృష్ట్యా పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ సిపిఎం ఇండియా కూటమిగా పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వార్డుల వారీగాఅభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థిని కూడా ఉమ్మడిగా నిర్ణయిస్తామని వెల్లడించారు.

## అలర్జీ కాదు.. ఊపిరితిత్తులకు ముప్పు!

**తగ్గని దగ్గు, ఆయాసాన్ని నిర్లక్ష్యం చేయొద్దు**

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 14:**




పావురాల రెట్టలు, వృత్తిపరమైన దుమ్ము, కాలుష్యం, శుభ్రం చేయని ఏసీ ఫిల్టర్ల వల్ల ప్రాణాంతక హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్ హెచ్‌పి వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని ప్రముఖ పల్మనాలజీ నిపుణులు డాక్టర్ గోపీ కృష్ణ ఎడ్లపాటి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని స్వాధిష్ఠ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ఈ వ్యాధి వల్ల ఊపిరితిత్తుల్లోని గాలి సంచుల చుట్టూ ఉండే కణజాలం దెబ్బతిని శ్వాస తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. రైతులు, వడ్రంగులు, నిర్మాణ కార్మికులు, డ్రిల్లింగ్ కార్మికులు, పెయింటర్లు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మందులు వాడినా తగ్గని దగ్గు, చిన్నపాటి నడకకే తీవ్రమైన ఆయాసం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు.

హై రిజల్యూషన్ సీటీ స్కాన్, లంగ్ ఫంక్షన్ టెస్టులు, రక్తపరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తిస్తే సరైన చికిత్సతో వ్యాధిని నియంత్రించవచ్చని, ఆలస్యం చేస్తే ఊపిరితిత్తులు శాశ్వతంగా దెబ్బతిని, తీవ్రమైన పరిస్థితుల్లో మార్పిడి అవసరం కావచ్చని హెచ్చరించారు.

పనిచేసే ప్రదేశాన్ని బట్టి ఎన్95 లేదా తగిన రక్షణ మాస్కులు ధరించాలని, ఏసీ ఫిల్టర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. యశోద హాస్పిటల్స్, హైదరాబాద్ హైటెక్ సిటీలో ఊపిరితిత్తుల వ్యాధులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాయికిరణ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వివరాలకు 040-45674567 నంబరును సంప్రదించవచ్చు.

# ధరల సెగ.. మార్కెట్ల జోరు!

(సి.హెచ్. ప్రతాప్)

**1. ఆందోళన కలిగిస్తున్న ద్రవ్యోల్బణం!**

సెప్టెంబరులో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి పెరిగింది. ఆగస్టులో ఇది 4.83 శాతంగా ఉన్నట్లు కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఆహార ద్రవ్యోల్బణం 5.97 శాతం నుంచి 7.74 శాతానికి ఎగసింది. గ్రామీణ ప్రాంతాల్లో ధరల పెరుగుదల 6.08 శాతం కాగా, పట్టణాల్లో 4.88 శాతంగా నమోదైంది. ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కుటుంబ బడ్జెట్లపై ఒత్తిడి పెంచుతోంది. రిజర్వ్ బ్యాంకు నిర్దేశించుకున్న నాలుగు శాతం లక్ష్యంతో పోలిస్తే తాజా ద్రవ్యోల్బణం అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో వడ్డీరేట్లు, వినియోగ వ్యయంపై ప్రభావాన్ని ఆర్థిక నిపుణులు పరిశీలిస్తున్నారు. ధరలను అదుపులో ఉంచడంతోపాటు సరఫరాను మెరుగుపరచడం అత్యవసరంగా మారింది.

**2. స్టాక్ మార్కెట్లలో భారీ లాభాలు!**

మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,109.10 పాయింట్లు పెరిగి 73,033.78 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 358.60 పాయింట్ల లాభంతో 22,721.95కు చేరింది. ఐటీ రంగ షేర్ల కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన బలాన్నిచ్చాయి. నిఫ్టీ ఐటీ సూచీ 5.2 శాతం ఎగసి 17 నెలలకుపైగా కాలంలో అత్యుత్తమ రోజువారీ పెరుగుదలను నమోదు చేసింది. హెచ్‌సీఎల్‌టెక్ షేరు 8.4 శాతం, టీసీఎస్ 6.8 శాతం లాభపడ్డాయి. మొత్తం 16 ప్రధాన రంగాల్లో 15 రంగాల సూచీలు పెరిగాయి. అయితే అంతర్జాతీయ ముడిచమురు ధరలు 100 డాలర్లపైనే ఉండటం, పశ్చిమాసియా అనిశ్చితి కొనసాగడం వల్ల మార్కెట్లలో అప్రమత్తత అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.




**3. హెచ్‌సీఎల్‌టెక్ లాభాల్లో 21 శాతం వృద్ధి!**

ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ జూలై--సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.5,132 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం 21.2 శాతం పెరిగింది. కంపెనీ ఆదాయం 11.5 శాతం వృద్ధితో రూ.35,620 కోట్లకు చేరింది. నిర్వహణ లాభాల మార్జిన్ 18.2 శాతంగా నమోదైంది. షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో 325.8 కోట్ల డాలర్ల కొత్త ఒప్పందాలు సాధించింది. స్థిర మారక విలువల్లో వార్షిక ఆదాయ వృద్ధి అంచనాను 2.5--4 శాతంగా సవరించింది. అడ్వాన్స్‌డ్ ఏఐ విభాగం వార్షికీకరించిన ఆదాయం 21.9 కోట్ల డాలర్లకు చేరింది. కృత్రిమ మేధ రంగంలోని అవకాశాలు పెరుగుతున్నప్పటికీ ప్రపంచ డిమాండ్ అనిశ్చితంగా ఉందని యాజమాన్యం పేర్కొంది.

**4. బలపడుతున్న రూపాయి.. ఆర్‌బీఐ చర్యల ప్రభావం!**

డాలరుతో పోలిస్తే భారత రూపాయి మంగళవారం మరింత బలపడింది. విదేశీ మారక మార్కెట్లో ఒక దశలో డాలరుకు రూ.95.0725 స్థాయికి చేరిన రూపాయి, చివరకు రూ.95.28 వద్ద ముగిసింది. గత ముగింపుతో పోలిస్తే సుమారు 0.5 శాతం పుంజుకుంది. డాలర్లపై డిమాండ్ తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంకు తీసుకున్న నియంత్రణ చర్యలు ఇందుకు దోహదపడ్డాయి. ఆధారమైన లావాదేవీలు లేకుండా నిర్వహించే కొన్ని విదేశీ మారక డెరివేటివ్ ఒప్పందాల పరిమితిని 10 కోట్ల డాలర్ల నుంచి 50 లక్షల డాలర్లకు తగ్గించింది. ఈ చర్యలు రూపాయికి మద్దతుగా నిలిచాయి. రూపాయి బలోపేతం దిగుమతిదారులకు ఊరటనిచ్చే అవకాశం ఉన్నప్పటికీ చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు సవాళ్లుగానే ఉన్నాయి.

# ఎన్నికల ఫలితాలు చెప్పే రాజకీయ వాస్తవాలు

. (ప్రతాప్)



ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం రాజకీయ పార్టీల గెలుపోటములను మాత్రమే నిర్ణయించవు. ప్రజల ఆలోచనలు, స్థానిక సమస్యలు, నాయకత్వంపై విశ్వాసం, మారుతున్న సామాజిక సమీకరణాలను కూడా ప్రతిబింబిస్తాయి. ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికలు ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టం చేశాయి. ఒకవైపు ప్రజా నిరసనలు, రాజకీయ చర్చలు కొనసాగుతుండగా, మరోవైపు ఎన్నికల ఫలితాలు భిన్నమైన సంకేతాలను అందించడం విశేషం. ప్రజాభిప్రాయాన్ని అంచనా వేయడంలో విస్తృత రాజకీయ పరిణామాలతోపాటు స్థానిక పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి.

తాజాగా ఐదు అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో ఆయా రాష్ట్రాల అధికార పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రేజీనగర్ స్థానాల్లో భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించగా, తమిళనాడులో రెండు స్థానాలను తమిళగ వెట్రి కళగం గెలుచుకుంది. అసోంలోని నాగావ్ లోక్‌సభ నియోజకవర్గ ఫలితం కూడా అక్కడి రాజకీయ సమీకరణాల్లో మార్పులను సూచించింది. ఈ ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి.

అయితే ఉపఎన్నికల విజయాలను ప్రభుత్వ పనితీరుకు సంపూర్ణ ఆమోదంగా భావించడం సముచితం కాదు. అదేవిధంగా ప్రజా నిరసనలు జరుగుతున్నాయనే కారణంతో అధికార పార్టీలపై వ్యతిరేకత పెరిగిపోయిందని నిర్ధారించడం కూడా తొందరపాటే. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం పౌరుల హక్కు. ఎన్నికల్లో తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవడం కూడా అదే ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. ఈ రెండు పరిణామాలను పరస్పర విరుద్ధమైనవిగా కాకుండా ప్రజాభిప్రాయం వ్యక్తమయ్యే భిన్నమైన మార్గాలుగా చూడాలి.

ఒక నియోజకవర్గంలో అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజలతో సంబంధాలు, స్థానిక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, అందుబాటులో ఉండే నాయకత్వం ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. రాష్ట్రస్థాయి రాజకీయ చర్చల్లో ప్రధానంగా కనిపించే అంశాలకంటే తాగునీరు, రహదారులు, ఉపాధి, విద్య, వైద్యం వంటి రోజువారీ సమస్యలకు ఓటర్లు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవచ్చు. అందువల్ల ఒకే సమయంలో వివిధ రాష్ట్రాల్లో భిన్నమైన రాజకీయ ధోరణులు కనిపించడం సహజం.

ఈ ఫలితాల నుంచి అధికార, ప్రతిపక్ష పార్టీలు నేర్చుకోవాల్సిన పాఠాలున్నాయి. అధికారంలో ఉన్నవారు ఎన్నికల విజయంతో సంతృప్తి చెందకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించాలి. నిరసనల వెనుక ఉన్న ఆందోళనలను ప్రభుత్వాలు వినాలి. ప్రజల ఆకాంక్షలను విధాన నిర్ణయాల్లో ప్రతిబింబింపజేయాలి.

ముఖ్యంగా ఉపఎన్నికలు పరిమిత నియోజకవర్గాల తీర్పులనే వెల్లడిస్తాయి. వాటి ఆధారంగా దేశవ్యాప్త రాజకీయ భవిష్యత్తును నిర్ణయించడం సరికాదు. ఓటర్ల నిర్ణయాన్ని గౌరవిస్తూనే, గెలిచినవారు వినయాన్ని, ఓడినవారు ఆత్మపరిశీలనను అలవర్చుకోవాలి.

ప్రజాస్వామ్యంలో అంతిమ లక్ష్యం ఏ పార్టీ విజయం సాధించిందన్నది కాదు; ఆ విజయంతో ప్రజల జీవన ప్రమాణాలు ఎంత మెరుగుపడ్డాయన్నదే అసలైన ప్రశ్న. ఎన్నికలు అధికారాన్ని అప్పగిస్తాయి. ప్రజాసేవ మాత్రమే ఆ అధికారానికి సార్థకతను కల్పిస్తుంది.



## కొయ్యూరులో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఘన సన్మానం

కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 15,

కొయ్యూరు మండలంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వీర సత్యనారాయణ (దొరబాబు) ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వెలుగు మహిళా సంఘాల సభ్యులు దొరబాబు కి శాలువా కప్పి, మెమొంటో అందజేసి సత్కరించారు. పార్టీ బలోపేతానికి, మహిళా సంఘాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




## శరన్నవరాత్రుల ప్రత్యేక శీర్షిక-5వ రోజు

## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణ

**లలితా సహస్రనామం అంటే ఏమిటి?**

లలితా అంటే ఆటలాడే తల్లి, సుకుమారి, అందమైనది. సహస్రం అంటే వెయ్యి. అమ్మవారి 1000 నామాలు. వీటిని సాక్షాత్తు హయగ్రీవ స్వామి అగస్త్య మహర్షికి చెప్పారు. లలితా రహస్య సహస్రనామం, లలితా సహస్రనామం అని రెండు ఉన్నాయి, రెండూ ఒకటే తత్వం.

**అమ్మవారిని ఆరాధన ఎందుకు చేయాలి**

శ్రీ చక్రానికి ప్రాణం:

అమ్మవారి ఫోటోలో వెనుక ఉండే త్రికోణాల చక్రమును శ్రీ చక్రం అని అంటారు. ఆ శ్రీ చక్రంలోని ప్రతి భాగానికి ఒక నామం ఉంటుంది. సహస్రనామం చదివితే శ్రీ చక్రాన్ని చుట్టి వచ్చినంత పుణ్యం.

**మూడు శక్తుల కలయిక:**

మొదటి 100 నామాలు - సృష్టిని చేసే బ్రహ్మ శక్తి.
మధ్య 400 నామాలు - రక్షించే విష్ణు శక్తి.

చివరి 500 నామాలు - లయం చేసే శివ శక్తి
అందుకే దీన్ని చదివితే త్రిమూర్తులను పూజించిన ఫలం.
ముఖ్యమైన 3 బీజాక్షరాల అర్థం - వివరణ
"ఐం హ్రీం శ్రీం"
ఇవి అమ్మవారి బీజాక్షరాలు.
ఐం = సరస్వతి (జ్ఞానం),
హ్రీం = పార్వతి (శక్తి),
శ్రీం = లక్ష్మి (ఐశ్వర్యం).
ఒక్క మంత్రంలో ముగ్గురు అమ్మలు.
"చిదగ్ని కుండ సంభూతా"
అర్థం:
జ్ఞానమనే అగ్ని కుండం నుండి పుట్టిన తల్లి. అంటే అజ్ఞానం అనే చీకటిని ఛిద్రం చేసే జ్ఞాన జ్యోతి అమ్మ.
"బ్రహ్మోపేంద్ర మహేంద్రాది దేవ సంస్తుత వైభవా"
అర్థం:
బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలైన దేవతలందరూ కూడా అమ్మ వైభవాన్ని స్తుతిస్తారు. అంటే దేవతలకు కూడా దేవత ఆమె.
ఈ శరన్నవరాత్రులలో చదివితే ఏమవుతుంది?
"ఒకసారి లలితా సహస్రనామం చదివితే, ఒకసారి భగవద్గీత చదివిన ఫలం కంటే ఎక్కువ". నవరాత్రులలో ప్రతి రోజు సాయంత్రం దీపం పెట్టి చదివితే:

ఇంట్లో శాంతి, శ్రేయస్సు, సౌభాగ్యం,సంతోషం తప్పక సిద్ధిస్తాయి.
పిల్లలకు జ్ఞానం పెరుగుతుంది.
ధర్మ బద్ధమైన కోరికలు నెరవేరును.




రచన
ఏ. బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు, నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త

# నాసిరకం మౌలిక సదుపాయాలకు బాధ్యత ఎవరిది?

(ప్రతాప్)



అభివృద్ధికి రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్లు అత్యంత అవసరం. ప్రజాధనంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మౌలిక సదుపాయాలు ప్రజలకు సౌకర్యాన్ని కల్పించాలి. ప్రయాణ సమయాన్ని తగ్గించాలి. రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. కానీ ప్రారంభించిన కొద్దిరోజులకే ట్రాఫిక్ సమస్యలు, నిర్మాణ లోపాలు బయటపడితే ఆ ప్రాజెక్టుల ప్రయోజనంపై సందేహాలు తలెత్తడం సహజం. ముఖ్యంగా లోపాలకు బాధ్యత వహించాల్సిన సంస్థ ఏదో స్పష్టంగా లేకపోవడం మన మౌలిక సదుపాయాల నిర్వహణలో పరిష్కరించాల్సిన ప్రధాన సమస్య.

ఢిల్లీలో ఇటీవల ప్రారంభించిన బారాపుల్లా మూడోదశ ఫ్లైఓవర్ ఇందుకు తాజా ఉదాహరణ. ప్రారంభమైన రెండు రోజుల్లోనే సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి సరాయ్ కాలేఖాన్ వరకు ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టినట్లు వార్తలు వెల్లడించాయి. ట్రాఫిక్ పోలీసుల డ్రోన్ పరిశీలనలో రహదారులు కలిసే ప్రాంతాల్లో రూపకల్పన లోపాలు బయటపడ్డాయి. మూడు వరుసలున్న రెండు రహదారుల నుంచి వచ్చే వాహనాలు మరో మూడు వరుసల రహదారిలోకి ప్రవేశించాల్సి రావడం, కొన్ని ప్రాంతాల్లో వాహన వరుసలు అకస్మాత్తుగా ముగియడం రద్దీకి కారణాలుగా గుర్తించారు.

ఇలాంటి సమస్యలు దేశంలోని ఇతర నగరాల్లోనూ కనిపించాయి. ముంబయిలో గోఖలే వంతెనను పక్కనున్న ఫ్లైఓవర్‌తో అనుసంధానించడంలో తలెత్తిన ఎత్తు వ్యత్యాసం



చర్చనీయాంశమైంది. భోపాల్‌లోని ఐష్‌బాగ్ రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై దాదాపు లంబకోణంలో మలుపు ఏర్పాటు చేయడం నిర్మాణ ప్రణాళికపై ప్రశ్నలను లేవనెత్తింది. ఢిల్లీలో రూ.777 కోట్లతో నిర్మించిన ప్రగతి మైదాన్ సొరంగమార్గంలో నీరు చేరడం, పగుళ్లు ఏర్పడడం కూడా నాణ్యత పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని గుర్తుచేశాయి.

వాస్తవానికి ఆధునిక నగరాల్లో మౌలిక సదుపాయాల నిర్మాణం సంక్లిష్టమైన ప్రక్రియ. భూసేకరణ సమస్యలు, స్థలాభావం, భూగర్భ సేవలు, పెరుగుతున్న వాహనాల సంఖ్య, వివిధ ప్రభుత్వ విభాగాల అనుమతులు ప్రాజెక్టుల అమలును ప్రభావితం చేస్తాయి. అయితే ఈ పరిమితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర ప్రణాళిక రూపొందించడమే సమర్థమైన నిర్వహణకు నిదర్శనం.

ఒక ప్రాజెక్టులో ప్రజాపనుల శాఖ, మున్సిపల్ సంస్థ, రైల్వేలు, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు భాగస్వాములై ఉండవచ్చు. కానీ సమస్య తలెత్తినప్పుడు ఒక సంస్థ మరొక సంస్థపై బాధ్యత నెట్టివేస్తే ప్రజలకు పరిష్కారం లభించదు. అందువల్ల ప్రతి ప్రాజెక్టుకు రూపకల్పన నుంచి నిర్వహణ వరకు సమన్వయ బాధ్యత వహించే అధికార వ్యవస్థను స్పష్టంగా నిర్ణయించాలి.

ప్రాజెక్టు ప్రారంభానికి ముందే స్వతంత్ర సాంకేతిక నిపుణులతో భద్రత, నిర్మాణ నాణ్యత, ట్రాఫిక్ ప్రవాహంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. భవిష్యత్తులో పెరిగే వాహనాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల అభిప్రాయాలను సేకరించాలి. నిర్మాణ లోపాలను సరిదిద్దే బాధ్యతను ఒప్పందాల్లో స్పష్టంగా పొందుపరచాలి.

అలాగే ప్రాజెక్టుల వ్యయం, పురోగతి, నాణ్యత పరీక్షల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రారంభోత్సవం తర్వాత కూడా పనితీరును సమీక్షించాలి. లోపాలు తలెత్తితే వాటిని నిర్దిష్ట గడువులో సరిదిద్దే విధానం ఉండాలి. మంచి పనితీరును ప్రోత్సహిస్తూ, నిర్లక్ష్యం నిర్ధారణైతే తగిన జవాబుదారీతనం అమలు చేయాలి.

అభివృద్ధిని కేవలం నిర్మించిన వంతెనల సంఖ్యతోనో, వెచ్చించిన కోట్ల రూపాయలతోనో కొలవకూడదు. ప్రజలకు కలిగిన సౌకర్యం, ఆదా అయిన సమయం, పెరిగిన భద్రత, నిర్మాణాల మన్నికే నిజమైన ప్రమాణాలు.

ప్రారంభోత్సవంతో ప్రభుత్వ ప్రాజెక్టు పూర్తవుతుంది. కానీ ప్రజలకు దాని ప్రయోజనం అందినప్పుడే అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుంది. ప్రజాధనంతో చేపట్టే ప్రతి నిర్మాణానికి నాణ్యత పునాది కావాలి. జవాబుదారీతనం రక్షణగా నిలవాలి.

# కొయ్యూరులో కూటమి నేతల ఆత్మీయ సమావేశం

## కలిసికట్టుగా పని చేద్దాం - విజయం సాధిద్దాం

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 15,**

కొయ్యూరు మండల కేంద్రంలో బుధవారం కూటమి నేతల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి 14 సెగ్మెంట్లలో విజయం సాధించి చంద్రబాబు నాయుడు గారికి బహుమతిగా ఇద్దామని నేతలు పిలుపునిచ్చారు.పాడేరు నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా రహదారులు, స్వచ్ఛమైన తాగునీరు, హౌసింగ్, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతిపక్షానికి అవకాశం లేకుండా ముందుకు సాగుతోందన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు.ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి మాట్లాడుతూ, కూటమిలో చిన్న చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని, ఏ పార్టీకి సీటు వచ్చినా ముగ్గురూ కలిసి గెలిపించాలని సూచించారు.బీజేపీ నేత, కూడా కృష్ణారావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వీజీబీ రామ్-జీ పథకం ద్వారా 150 రోజుల వేతనం, జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు వంటి ఎన్నో పథకాలతో



రాష్ట్రానికి మేలు చేస్తోందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.వి. ప్రసాద్, టూరిజం డైరెక్టర్ రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు కొట్టుగులి సుబ్బారావు, బొర్రా నాగరాజు, బీజేపీ ఎంపీటీసీ చైర్మన్ మంగ తల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాజు, మండల టీడీపీ అధ్యక్షులు చంద్రరావు, మాజీ జెడ్పీటీసీ గాది శ్రీరామ్ మూర్తి, మాజీ ఎంపీపీ జి. సత్యనారాయణ, కొర్రా రామ్మూర్తి, వై. వరహాలు బాబు, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, జనసేన వీర మహిళ నియోజకవర్గ కమిటీ మెంబర్ భావన సాయి, జనసేన మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణ్, సుధీర్ బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్ కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపోయిన చక్రరావు తదితర టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అభయాంజనేయ విగ్రహ నిర్మాణానికి మాజీ సర్పంచ్ విరాళం

**దేవరాపల్లి, అక్టోబర్ 14, జయ జయహే :**

మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో శ్రీ అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణానికి నాగయ్యపేట మాజీ సర్పంచి ఆదిరెడ్డి శంకర సత్యవతి రూ. 10వేల రూపాయలను ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి చేతుల మీదగా స్థానిక నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకు అందజేశారు. కాశీపురం మాజీ ఉప సర్పంచ్ ఆదిరెడ్డి సింహాచలం నాయుడు (మాస్టర్) 10వేల రూపాయలు విరాళం అందించారు. అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి తోడ్పాటును అందించిన వారందరికీ ఈ సందర్భంగా భాస్కరరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, ఆదిరెడ్డి ఈశ్వరరావు మాస్టర్, ఆదిరెడ్డి సూర్యనారాయణ, వేచలపు శ్రీరామ్, వేచలపు నరేంద్ర, కొట్యాడ రవి, వేచలపు త్రినాథ్, గొర్లి శ్రీను, బాల వెంకటరావు, బత్తి రాంబాబు, జాజిమొగ్గల మహాలక్ష్మి, వంటాకు నాగరాజు, సింగంపల్లి దేముడుబాబు, కొమినేని కృష్ణ పాల్గొన్నారు.




# జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

**విజయనగరం, అక్టోబర్ 14: (జయ జయహే)**

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు.అసెంబ్లీ సమన్వయకర్తలు రౌతు సతీష్, ఎర్నాగుల చక్రవర్తి, త్యాడ రామకృష్ణారావు (బాలు) నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి విజయనగరం నగరంలోని 62 డివిజన్ల ప్రతినిధులు, వీర మహిళలు, గతంలో కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, డివిజన్ల వారీగా ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తలు తమ తమ అభిప్రాయాలను, సూచనలను సమావేశంలో వెల్లడించారు.క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలను క్రోడీకరించి, వాటిని పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీకి అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. తద్వారా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణను మరింత పటిష్టంగా రూపొందించేందుకు ఈ సమావేశం దోహదపడనుంది. స్థానిక నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, సమష్టి నిర్ణయాలతో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు.




# కైలాసగిరిపై పోలీసు అవుట్‌పోస్టు ప్రారంభం

## పర్యాటకుల భద్రతకు ప్రత్యేక చర్యలు..

## త్వరలో ఘాట్‌రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గం

**విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే**

: పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై సందర్శకుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పోలీసుశాఖ సహకారంతో పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ అవుట్‌పోస్టును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ కైలాసగిరికి రోజురోజుకూ పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి సందర్శకులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. కైలాసగిరిపై పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఘాట్‌రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మరో రహదారిని త్వరలో నిర్మించనున్నట్లు ప్రణవ్‌గోపాల్ తెలిపారు.నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ కైలాసగిరిపై పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పర్యాటకులు, సందర్శకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మణికంఠ, ఏసీపీలు మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# గుండెపోటుతో పోలీసు కానిస్టేబుల్ మృతి

## - ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

## - కొత్తపెంటలో విషాదం

**దేవరాపల్లి, అక్టోబర్ 14, జయ జయహే**



జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) విభాగంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ పైలా మోహన్ బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఆయన 2009 బ్యాచ్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తున్నారు. భవానీ మాలధారణలో ఉన్న మోహన్ స్నానం చేసిన అనంతరం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు తొలుత కె.కోటపాడు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకెళ్తుండగా పెందుర్తి వద్ద పరిస్థితి విషమించింది. దీంతో పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆయన తుదిశ్వాస విడిచారు. మోహన్ మృతి పట్ల అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిబద్ధత, అంకితభావంతో పనిచేసిన మోహన్ సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మోహన్ స్వగ్రామమైన కొత్తపెంటలో అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వి.బాబ్జీరావు, సీఐలు ఎస్.బాలసూర్యరావు, కె.కృష్ణ, జి.అశోక్‌కుమార్, పి.రమేష్, ఎస్ఐ వి.సత్యనారాయణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పోలీసు గౌరవ వందనం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మోహన్ మృతితో కొత్తపెంట గ్రామంలో, పోలీసు సహచరుల్లో విషాదం అలముకుంది. మోహన్‌కు భార్య భవాని (38), ఇద్దరు కుమారులు భవేష్ (12), పైలా ప్రసన్నకుమార్ (9) ఉన్నారు. ఆయన మృతి ఆ కుటుంబానికి తీరని లోటుగా మిగిలింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు.



# ఈపీడీసీఎల్ పరిధిలో 589 మెగావాట్లకు చేరిన సౌర విద్యుత్ ఉత్పాదన

## విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు సౌర విద్యుత్

## - ఈపీడీసీఎల్ సోలార్ ఎనర్జీ చీఫ్ జనరల్ మేనేజర్ జి. శ్యాంబాబు

**విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే**

గృహ వినియోగదారులు సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ ఎనర్జీ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ జి. శ్యాంబాబు పిలుపునిచ్చారు. పునరుత్పాదక ఇంధన వినియోగంతో విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈపీడీసీఎల్ పరిధిలో సౌర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 589 మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్ఐ) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్: ముఫ్త్ బిజ్లీ యోజనపై నిర్వహించిన ప్రత్యేక ప్రసంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా అర్హులైన గృహ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందవచ్చని వివరించారు.

**1,48,770 దరఖాస్తులు.. 1,04,820 ఇళ్లలో ఏర్పాట్లు పూర్తి**

2026 అక్టోబర్ 13 నాటికి ఈపీడీసీఎల్ పరిధిలో పీఎం సూర్యఘర్ పథకం కింద 1,48,770 దరఖాస్తులు నమోదయ్యాయని, 1,04,820 గృహాల్లో సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తయిందని శ్యాంబాబు తెలిపారు. వీటి ద్వారా 331.53 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. సౌర విద్యుత్ ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాలు, సోలార్ వ్యవస్థల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రజాసంబంధాల విభాగాలు కీలక పాత్ర పోషించాలని శ్యాంబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు, పీఆర్‌ఎస్ఐ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ఎం.కె.వి.ఎల్. నరసింహం, కార్యదర్శి ఎ. గోవిందరావు, కోశాధికారి ఎన్.వి. నరసింహం, పీఆర్‌ఎస్ఐ సభ్యులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



# ప్రయోగాత్మక పరిజ్ఞానం అవసరం

## జాయ్ ఆఫ్ ఇంజనీరింగ్ శిక్షణలు

## జేఎన్టీయూ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ మురళీకృష్ణ

**టెక్కలి అక్టోబర్ 14 జయ జయహే**

సమాజ ఉజ్వల భవిష్యత్తుకు ప్రయోగాత్మక పరిజ్ఞానం చాలా అవసరం అని కాకినాడ జేఎన్టీయూ మాజీ ఉపకులపతి కె వి ఎస్ జి మురళీకృష్ణ పేర్కొన్నారు, ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన చాయ్ ఆఫ్ ఇంజినీరింగ్ రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు.ఉజ్వల సమాజానికి విద్యార్థుల చక్కని భవిష్యత్తుకు ప్రయోగాత్మక పరిజ్ఞానం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు, ఇంజనీరింగ్ కేవలం ఉద్యోగం పొందేందుకు మాత్రమే చదివే కోర్సు కాదని సమాజ సమస్యలను పరిష్కారాల చూపే మార్గాలను అన్వేషించే అవకాశమని మురళీకృష్ణ స్పష్టం చేశారు, విద్యార్థులు తొలి ఏడాది నుంచే పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తూ ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని సంపాదించుకోవాలన్నారు, ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి తో నూతన ఆలోచనలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పనిని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించాలని ప్రొఫెసర్ మురళీకృష్ణ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ ఆర్ శాంతి కుమార్, హెచ్ డి ఓ లు డాక్టర్ రత్న మణి , డాక్టర్ ఎం రమణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు

## వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి చేయూత ఫౌండేషన్

**గుంటూరు (జయ జయహే)**

నగరంలో వివిధ పౌర సంస్థల ఉమ్మడి వేదికగా ఏర్పడిన కనెక్ట్ ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు కనెక్ట్ కో ఆర్డినేటర్, చేయూత ఫౌండేషన్ కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో బీపీ మండల్ ట్రస్ట్ అధ్యక్షులు డా|| ఆలా వెంకటేశ్వర్లు, నేస్తం సహ వ్యవస్థాపకులు తమ్మా ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా అచ్చంపేటలో మేకల కాపరిగా జీవనం కొనసాగిస్తూ పేదరికాన్ని అనుభవిస్తున్న గుడేలి ఝాన్సీ ఎలాంటి శిక్షణ లేకుండానే అత్యున్నత ప్రతిభతో నీట్ 2026 జాతీయ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించడం పట్ల అభినందనలు తెలిపారు. వారి ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని బీపీ మండల్ ట్రస్ట్, చేయూత ఫౌండేషన్, కనెక్ట్ సంస్థలు గుడేలి ఝాన్సీ ఒక సంవత్సరం వైద్య విద్యను అభ్యసించేందుకు అవసరమైన లక్ష రూపాయలను పంపినామని తెలిపారు. బీపీ మండల్ ట్రస్ట్ అధ్యక్షులు డా|| ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూత నివ్వడం అత్యంత సంతృప్తిని కలిగిస్తుందని, గుంటూరు నగరంలోని సేవా తత్పరులు, సేవా సంస్థలు ముందుకొచ్చి పేదరికంలో మగ్గుతున్న విద్యార్థులకు బాసటగా నిలవాలని కోరారు. నేస్తం ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు తమ్మా ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ నేస్తం, మానవత, కోవిడ్ ఫైటర్స్, కార్మెల్ సేవా సదన్, రేట్ పేయర్స్ అసోసియేషన్, రెడ్ క్రాస్, చేయూత లాంటి పౌర సేవా సంస్థలు గుంటూరు నగరంలోని బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరణను పొందుతున్నాయని తెలిపారు. ఈనెల 18వ తేదీన ఆదివారం ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌర సేవా సంస్థల భాగస్వామ్యంతో గత 10 సంవత్సరాలుగా గుంటూరు నగరంలో 15 వేలకు పైగా మొక్కలు నాటి సంరక్షిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి కి అభినందన సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

# 78 రోజుల బోనస్.. చేతికి వచ్చేది రూ.17,951 మాత్రమే!

### 20 ఏళ్ల నాటి వేతన పరిమితితో కార్మికులకు అన్యాయం

### బోనస్‌ను ప్రస్తుత వేతనాల ఆధారంగా చెల్లించాలి

### సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ డిమాండ్



**విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే**

: రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదకత ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) ప్రకటిస్తున్నప్పటికీ, చేతికి అందుతున్న మొత్తం కేవలం రూ.17,951 మాత్రమేనని సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న రైల్వే కార్మికులకు వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందడం లేదని పేర్కొన్నారు. బోనస్ లెక్కింపు విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. 2006లో అమల్లోకి వచ్చిన ఆరో వేతన సంఘం మొదటి ప్రాథమిక వేతనం రూ.7,000ను ఇప్పటికీ బోనస్ లెక్కింపునకు పరిమితిగా పరిగణించడం అన్యాయమని రాజశేఖర్ పేర్కొన్నారు. 78 రోజుల బోనస్ అని ప్రకటిస్తున్నప్పటికీ, రెండు దశాబ్దాల క్రితం నాటి వేతన ప్రాతిపదికతో లెక్కించడం వల్ల ఉద్యోగులకు ఆశించిన ప్రయోజనం అందడం లేదన్నారు. బోనస్ ప్రకటన విన్న సామాన్య ప్రజలు రైల్వే ఉద్యోగులకు పెద్ద మొత్తంలో నగదు అందుతుందని భావిస్తున్నారని, వాస్తవంగా చేతికి వచ్చే మొత్తం మాత్రం చాలా తక్కువగా ఉంటోందని వివరించారు.

**పండుగ ఖర్చులకూ సరిపోని బోనస్**

దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి, పిల్లలకు కొత్త బట్టలు కొనడానికి కూడా రూ.17,951 బోనస్ మొత్తం సరిపోవడం లేదని రైల్వే ఉద్యోగుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. రైల్వే ఉద్యోగులు నిరంతరం అందిస్తున్న సేవలు, వారి శ్రమ, ఉత్పాదకతను గుర్తించి తగిన ప్రతిఫలం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**రూ.18 వేల వేతనాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి**

2016లో అమల్లోకి వచ్చిన ఏడో వేతన సంఘం మొదటి ప్రాథమిక వేతనం రూ.18,000ను బోనస్ లెక్కింపునకు ప్రాతిపదికగా తీసుకుని 78 రోజుల బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 2025--26 సంవత్సరానికి సంబంధించిన ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను ప్రస్తుత వేతనాలకు అనుగుణంగా లెక్కించి న్యాయమైన మొత్తాన్ని అందించాలని కోరారు.

78 రోజుల బోనస్ ప్రకటిస్తూ, లెక్కింపును మాత్రం పాత వేతన పరిమితికే కట్టిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన రాజశేఖర్.. రైల్వే కార్మికుల న్యాయమైన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బోనస్ విధానాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు.



## విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ

### ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు సిబ్బందికి మెరుగైన ప్రయోజనాలే లక్ష్యం

### పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో నిరంతర చర్చలు

### తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షులు పర్వతనేని

**విజయవాడ, అక్టోబర్ 14, జయ జయహే :**

విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణ (పీఆర్సీ) ప్రయోజనాలు కల్పించేందుకు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటుపల్లి శ్రీరామమూర్తి తెలిపారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ టీడీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలోని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గం పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ కార్యదర్శి విజయానంద్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సంస్థల్లో వేతన సవరణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగులకు తక్కువ ప్రయోజనాలు లభించే పరిస్థితి ఏర్పడిందని సంఘం తెలిపింది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, గతంలో అనుసరించిన విధానంలోనే పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసేలా కృషి చేసిన విద్యుత్ శాఖ మంత్రి, ఇంధన శాఖ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన పీఆర్సీ కమిటీలో ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, మెరుగైన వేతన సవరణ ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి చొరవతో జూనియర్ లైన్‌మెన్లను సంస్థలో విలీనం చేయడం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, అన్ని విద్యుత్ సంస్థల్లో ఒకే విధానం అమలు చేసే దిశగా మానవ వనరుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. అలాగే, 30-08-2004న నియామకమైన ఉద్యోగులకు ఈపీఎఫ్ స్థానంలో జీపీఎఫ్ సదుపాయం కల్పించడం, జూనియర్ లైన్‌మెన్ తదితర ఫీడర్ కేడర్ పోస్టులను భర్తీ చేయడం వంటి అంశాలను విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం, న్యాయమైన వేతన సవరణ, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ మెరుగైన ప్రయోజనాలు సాధించేందుకు సంఘం కట్టుబడి ఉంటుందని పర్వతనేని సాంబశివరావు, మోటుపల్లి శ్రీరామమూర్తి స్పష్టం చేశారు.



## పేద కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్

### 28 మంది లబ్ధిదారులకు రూ.20.94 లక్షల ఆర్థిక సాయం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**

శ్రీకాళహస్తి బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి. విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.20,94,644 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,94,644 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## జీవీఎంసీ ఎన్నికల్లో సమన్వయం కోసం సమాయత్తం

### విజయం సాధించేందుకు కూటమి నేతల నిర్ణయం

### ఎంఎ షరీఫ్ అధ్యక్షతన కీలక సమావేశం

**విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తూ అత్యధిక స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. బుధవారం విశాఖలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ స్థానిక ఎన్నికల పరిశీలకుడు ఎంఎ షరీఫ్ అధ్యక్షతన కూటమి నాయకులు సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పరస్పర సమన్వయంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ, కూటమి నేతలందరూ సమిష్టిగా పనిచేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహించని నియోజకవర్గాల్లో సంబంధిత సమన్వయకర్తలను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎన్నికల్లో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పి. విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పీలా గోవింద సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్, బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



## అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

### అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

**విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే**

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు శిలాఫలకాలు, ఇతర ఫలకాలపై పేర్లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు (ఎస్‌ఎస్‌టీ), ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందాలు (ఎంసీసీ), ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లకు సంబంధించి రూట్ మ్యాప్‌లతో కూడిన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గత ఎన్నికల అనుభవాలు, నిర్దేశిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సంబంధిత నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.




## ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా పేడాడ వెంకట ప్రతాప్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

### ప్రైవేటు పాఠశాలల సమస్యలపై రాజీలేని పోరాటం

### జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ కుమార్

**శ్రీకాకుళం - ( జయ జయహే )**

ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల సంఘం డెమోక్రటిక్ (ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్) శ్రీకాకుళం జిల్లా నూతన సారథిగా, ఆమదాలవలస ఎస్‌వీఎస్ పాఠశాల కరెస్పాండెంట్ పేడాడ వెంకట ప్రతాప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఘనంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుంటికోట కేఎన్ పాఠశాల ప్రిన్సిపాల్ జి. అరవింద్ నారాయణ, కోశాధికారిగా రణస్థలం సూర్య పాఠశాల కరెస్పాండెంట్ జి. సత్యమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు పేడాడ వెంకట.ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రభుత్వపరమైన, సాంకేతికపరమైన సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం బాధ్యతాయుతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి గట్టి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల విశేష సేవలను గుర్తించి గత రెండు నెలలుగా ఘనంగా సన్మానిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఎలాంటి ఆందోళనలు, ఒత్తిళ్లకు గురికాకుండా ధైర్యంగా విద్యాసంస్థలను నడపాలని, సంఘం ఎల్లప్పుడూ వారికి కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాణ్యమైన విద్యాబోధన, ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రైవేటు విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు జి.మోహన రావు, రాష్ట్ర ట్రెజరర్ ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు సిహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు.



## ఐసీడీఎస్ కార్యాలయంలో డీఈఓ పోస్టు ఖాళీ.. ముందుకు సాగని పనులు!

### రెండేళ్లుగా భర్తీకి నోచుకోని డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు

### ఆన్‌లైన్ నమోదుకు ఆటంకం.. వివిధ పనులపై ప్రభావం

### సంబంధిత అధికారులు స్పందించి పోస్టును భర్తీ చేయాలని ప్రజల విజ్ఞప్తి

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయం (ఐసీడీఎస్)లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ) పోస్టు ఖాళీగా ఉండటంతో పలు కీలకమైన పనులకు ఆటంకం ఏర్పడుతోంది. గత కొన్నేళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉండగా, రెండేళ్లుగా పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో కార్యాలయంలో వివిధ అభివృద్ధి, పరిపాలనా పనులు ముందుకు సాగడం లేదని సంబంధిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఈ పోస్టులో ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించినప్పటికీ, ఆయన ఒకటి రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహించి బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లిపోయినట్లు సమాచారం. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉండటంతో కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాల్సిన పలు పనులు పెండింగ్‌లో పడుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, అవసరమైన నివేదికలను రూపొందించడం, ప్రభుత్వానికి పంపాల్సిన సమాచారాన్ని సకాలంలో సమర్పించడం వంటి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందిపై అదనపు పని భారం పడటంతో పాటు, పనుల పురోగతిపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ విధానంలో సమాచార నమోదు, నివేదికల సమర్పణకు ప్రాధాన్యం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఐసీడీఎస్ కార్యాలయంలో కీలకమైన పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగా ఉండటం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, భవనాల మరమ్మతులు, ఇతర పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన పనులు సజావుగా సాగాలంటే డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకం అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న డీఈఓ పోస్టును వెంటనే భర్తీ చేసి, కార్యాలయంలో నిలిచిపోయిన పనులకు వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

# భారీగా తగ్గిన సంతానోత్పత్తి రేటు

### వృద్ధుల జనాభా పెరుగుదలపై నిపుణుల ఆందోళన

### మారుతున్న జనాభా పరిస్థితులపై సిడార్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలో ప్యానెల్ చర్చ

**విశాఖపట్నం, అక్టోబర్ 14 జయ జయహే**





: భారతదేశంలో మారుతున్న జనాభా పరిస్థితులు, వాటి వల్ల ఎదురయ్యే సామాజిక, ఆర్థిక సవాళ్లు, భవిష్యత్తులో అనుసరించాల్సిన కార్యాచరణపై సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్) ఆధ్వర్యంలో బుధవారం విశాఖపట్నంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో చర్చాగోష్ఠి నిర్వహించారు. 'భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న జనాభా పరిమాణాలు--ఆందోళనలు, భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై జరిగిన ఈ చర్చలో పలువురు ప్రముఖ విద్యావేత్తలు, నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

భారతదేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గడం, ప్రజల ఆయుర్దాయం పెరగడం, వృద్ధుల జనాభా విస్తరించడం, రాష్ట్రాల మధ్య జనాభా మార్పుల్లో వ్యత్యాసాలు, యువత నిరుద్యోగం వంటి అంశాలపై నిపుణులు లోతుగా చర్చించారు. దేశానికి జనాభా పరంగా ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్ విధానాలను రూపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. బాలమోహనదాస్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ కె.సి. రెడ్డి భారత జనాభాలో చోటుచేసుకుంటున్న ప్రధాన మార్పులను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య విద్యాశాఖ మాజీ సంచాలకులు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్. శశిప్రభ సంతానోత్పత్తి రేటు తగ్గుదలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించారు.

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ పి. శ్యామ్ ప్రసాద్ ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య జనాభా ధోరణుల్లో ఉన్న వ్యత్యాసాలను వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగం మాజీ ఆచార్యులు ప్రొఫెసర్ జి. రామచంద్రుడు జనాభా పరివర్తన వల్ల సమాజంపై పడే ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రభావాలను విశ్లేషించారు.

కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, సిడార్ ప్రాజెక్టుల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. రామకృష్ణారావు కార్యక్రమానికి స్వాగతం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ జనాభా పరిశోధనా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి. మునిస్వామి, సిడార్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి. హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాల యూజీ, పీజీ విభాగాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎస్.కె. చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, క్యాంపస్ సమన్వయ డీన్ కె. సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఈ చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు.మారుతున్న జనాభా స్వరూపాన్ని సమగ్రంగా అర్థం చేసుకుని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, ప్రాంతీయ జనాభా అసమానతలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలపై దీర్ఘకాలిక విధానాలను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ చర్చాగోష్ఠి స్పష్టం చేసింది.



## సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబానికి రూ.1.35 లక్షల ఆర్థిక సాయం

### ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవతో కే. లక్ష్మికి ఊరట

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**

శ్రీకాళహస్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణంలోని 32వ వార్డుకు చెందిన కే. లక్ష్మి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,35,000 ఆర్థిక సాయం అందింది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవతో ఈ సాయం మంజూరైంది. కే. లక్ష్మి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరగా, శస్త్రచికిత్సకు లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1.35 లక్షల ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సాయంతో బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక ఊరట లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేల నుంచి లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆనందంగా జీవించగలరని, కష్టపడి తమ జీవితాలను సఫలం చేసుకోగలరని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, 32వ వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులు రెడ్డి, బూత్ కన్వీనర్ ఎస్.కె. షాబుద్దీన్, బూత్ కో-కన్వీనర్ తారాక్షి లోకేష్ ఆచారి, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలపర్తి యశ్వంత్, ఐటీడీపీ నాయకుడు తారాక్షి రేవంత్‌తో పాటు 32వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవస్థానం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి

### రూ.77 లక్షలతో తాత్కాలిక షెడ్ల నిర్మాణంపై అంజూరు తారక శ్రీనివాసులు అభ్యంతరం

### సామాన్య భక్తులకు ఉపయోగపడేలా నిర్మాణాలను మార్చాలి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**



శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. దేవాలయం నాలుగో నంబర్ గేటు వద్ద రూ.77 లక్షలతో తాత్కాలిక రేకుల షెడ్లు నిర్మించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం శాశ్వత మండపాలు నిర్మించాల్సి ఉండగా, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడం వల్ల నిధుల సద్వినియోగం ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు.

గతంలో నిర్మించిన కొన్ని షెడ్లు, బుకింగ్ కౌంటర్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని భక్తులకు ఉపయోగపడేలా ఉచిత డార్మిటరీలుగా మార్చాలని సూచించారు. సామాన్య భక్తులకు అందుబాటులో ఉండే రూ.500 రాహు-కేతు పూజలను కొనసాగించాలని కోరారు. దేవస్థానం అధికారులు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి నిధుల వినియోగంపై పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## పారిశుద్ధ్య, భద్రతా సిబ్బందికి సన్మానం

### విద్యార్థులు, సిబ్బందికి వైద్య శిబిరం

**విజయనగరం, అక్టోబర్ 14: (జయ జయహే)**

కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ లో స్వచ్ఛతాహి సేవా--2026 కార్యక్రమంలో భాగంగా 'సఫాయిమిత్ర' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య, నిర్వహణ సిబ్బంది సేవలను గుర్తించి, వారిని గౌరవించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, విజయనగరంలోని మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. ముక్కామల శరత్‌చంద్రబాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొని, విశ్వవిద్యాలయ పారిశుద్ధ్య, భద్రతా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. వారి సేవలను అభినందించి, జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. ముక్కామల శరత్‌చంద్రబాబు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వారి నిరంతర కృషి వల్లే విద్యార్థులు, సిబ్బందికి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం లభిస్తుందని తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న వారి సేవలను గుర్తించి, గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, పారిశుద్ధ్య, భద్రతా సిబ్బంది విశ్వవిద్యాలయ వ్యవస్థలో అంతర్భాగమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, సజావైన నిర్వహణలో వారి సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి, పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమ కమిటీ అధ్యక్షుడు, సమన్వయకర్త డా. అప్పసాబా ఎల్.వి., సహ సమన్వయకర్తలు డా. గంగు నాయుడు మండల, డా. నగేష్ మలియప్ప కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించగా ఈ కార్యక్రమంలో డా. శంకర్ రెడ్డి కొల్లె, డా. పి. శ్రీదేవి, డా. సురేష్ బాబు, డా.ఎం. ప్రసాద్, డా. దివ్య, డా.ప్రమా ఛటర్జీ, డా. కుసుమ్, సుప్రియ దాస్, డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మెడికవర్ ఆసుపత్రి తరఫున పి. ఓం సాయి, పి. సునీత, ఎం. అప్పలనాయుడు తదితరులు వైద్య శిబిరంలో సేవలందించారు.



### శ్రీకాళహస్తిలో

## ఎన్నికల కోడ్ అమలు

### 24 గంటల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**



శ్రీకాళహస్తి రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో అక్టోబర్ 14 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నియమావళి అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు, ప్రజలు ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. 24 గంటల్లో రాజకీయ ప్రచార సామగ్రి తొలగింపు మున్సిపాలిటీ పరిధిలో బహిరంగ ప్రదేశాలు, రహదారులు, వీధి కూడళ్లు, విద్యుత్ స్తంభాలు, బస్టాండ్లు, ప్రభుత్వ భవనాల ప్రహరీ గోడలు, ఇతర ప్రభుత్వ ఆస్తులపై అనుమతి లేకుండా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడ రాతలు, కటౌట్లు, జెండాలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలను సంబంధిత రాజకీయ పార్టీలే 24 గంటల్లోగా, అంటే అక్టోబర్ 15లోపు స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. పార్టీలు వాటిని తొలగించడంలో విఫలమైతే మున్సిపాలిటీ సిబ్బందే తొలగిస్తారని, ఇందుకు అయ్యే ఖర్చును సంబంధిత పార్టీల నుంచి వసూలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలను జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై ప్రచారానికి అనుమతి లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించరాదని కమిషనర్ సూచించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ సిబ్బందిని వినియోగించరాదని తెలిపారు. ప్రభుత్వ నిధులతో కొత్త పథకాలు, గ్రాంట్లు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టరాదని పేర్కొన్నారు.సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించాలన్నా, లౌడ్‌స్పీకర్లను వినియోగించాలన్నా స్థానిక పోలీసు, మున్సిపల్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనుమతి పొందిన సమయ పరిమితుల్లోనే కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో రాజకీయ పార్టీల ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.ఎన్నికల కోడ్‌కు సంబంధించిన అనుమతులు, ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని కె.వి. కృష్ణారెడ్డి సూచించారు.



## ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

### ప్రజలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు అప్రమత్తంగా ఉండాలి

### వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**

శ్రీకాళహస్తి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రజలు, వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీపావళి వేడుకలను ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. దుకాణదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, సరుకుల దిగుమతులను రాత్రి 9 గంటల తర్వాతే చేపట్టాలని సూచించారు.పట్టణంలోని కొన్ని మెడికల్ షాపుల్లో నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని సీఐ తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని సీఐ వెల్లడించారు. ఎన్టీఆర్ నగర్‌లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీసులు 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మహిళల రక్షణతోపాటు సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. మహిళలకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యోగాల పేరుతో వచ్చే నకిలీ ప్రకటనలు, ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు.ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు.

# హత్యా? ఆత్మహత్యా?

(ప్రతాప్)

ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతున్న యువతి మృతదేహం! శరీరంపై పలుచోట్ల గాయాలు! తొలుత ఆత్మహత్యగా భావించేలా ఉన్న ఆ మరణం వెనుక భయంకరమైన నిజం దాగుందా? పెళ్లయిన మూడేళ్లకే 23 ఏళ్ల యువతి అనుమానాస్పదంగా మరణించడం, ఆమెను భర్తే హత్య చేశాడని కన్నతల్లి ఆరోపించడం ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో కలకలం రేపింది. ఈ కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేయడంతో ఘటన కీలక మలుపు తిరిగింది.

జిల్లాలోని కృష్ణానందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజిమహలా గ్రామానికి చెందిన నూర్ మహమ్మద్ (29), అఫ్సానా బేగం (23)లకు 2023లో వివాహమైంది. అయితే వివాహమైనప్పటి నుంచి అదనపు కట్నం కోసం భర్త తన కుమార్తెను నిరంతరం వేధిస్తూ, హింసిస్తున్నాడని అఫ్సానా తల్లి సల్మా బీబీ ఆరోపించారు. ఆమె అటలాపూర్ గ్రామానికి చెందినవారు.






అక్టోబర్ 11, ఆదివారం రాత్రి అఫ్సానా అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించింది. అనంతరం ఆమె మృతదేహాన్ని సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా నమ్మించే ప్రయత్నం జరిగిందని సల్మా బీబీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహంపై పలుచోట్ల గాయాల గుర్తులు కనిపించడం హత్య అనుమానాలకు దారితీసింది.

ఈ కేసులో కీలకంగా మారిన అంశం అఫ్సానా శరీరంపై కనిపించిన గాయాలే. ఉరి వేసుకున్న పరిస్థితుల్లో ఆ గాయాలు ఎలా వచ్చాయి? అవి మరణానికి ముందువా, తరువాతివా? అనే ప్రశ్నలకు వైద్య పరీక్షల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. మృతదేహం వేలాడుతూ కనిపించిందన్న కారణంతో ఆత్మహత్యగా నిర్ధారించలేం. అలాగే గాయాలున్నాయనే కారణంతో హత్య నిరూపితమైనట్లు చెప్పలేం. అందువల్ల వైద్యాధారాలు ఈ కేసులో అత్యంత కీలకం కానున్నాయి.

అక్టోబర్ 12, సోమవారం సల్మా బీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని జగత్‌సింగ్‌పూర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

అఫ్సానా మరణానికి ముందు దంపతుల మధ్య ఏవైనా వివాదాలు జరిగాయా? కుటుంబ సభ్యులకు గతంలో వేధింపుల విషయం తెలిసిందా? కట్నం డిమాండ్లను నిర్ధారించే ఇతర ఆధారాలున్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఫిర్యాదులోని ఆరోపణలు, పోస్టుమార్టం నివేదిక, సంఘటనా స్థలానికి సంబంధించిన ఆధారాలను సమగ్రంగా పరిశీలించినప్పుడే మరణం చుట్టూ నెలకొన్న సందేహాలకు సమాధానం లభిస్తుంది.

అక్టోబర్ 13, మంగళవారం నూర్ మహమ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని హత్యకు సంబంధించిన సెక్షన్ 103, భర్త లేదా అతని బంధువుల క్రూరత్వానికి సంబంధించిన సెక్షన్ 85తోపాటు వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్ 4 కింద అభియోగాలు నమోదు చేసినట్లు కృష్ణానందపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రంజన్ కుమార్ మాఝీ వెల్లడించారు. అదే రోజు నిందితుడిని జగత్‌సింగ్‌పూర్ న్యాయస్థానంలో హాజరుపరచగా, బెయిల్ అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

అఫ్సానా మరణం హత్యేనా? ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందా? కన్నతల్లి ఆరోపణల్లో నిజమెంత? ఈ ప్రశ్నలకు పోస్టుమార్టం నివేదిక, పోలీసుల తదుపరి దర్యాప్తులో లభించే ఆధారాలే సమాధానం చెప్పనున్నాయి.

# స్థానిక ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలం

## 2 రోజుల్లో జాబితా

జయ జయహే: అక్టోబర్ 14

స్థానిక ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు పంచాయితీకి తెరపడింది. మేయర్ పీఠాల దగ్గర మొదలైన చర్చలు అభ్యర్థుల ప్రకటన దిశగా చేరాయి. సీట్ల కోసం కొట్టుకుంటున్నారన్న సంకేతాలు ఇవ్వకుండా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా కూటమి పార్టీల నేతలు సర్దుబాటు చేసుకున్నారు. సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు జనసేన నేతలు ధన్యవాదాలు తెలిపారు.



భేటీ అనంతరం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజుల్లో కలిసే పోటీ చేసే అభ్యర్థుల్ని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలమయ్యాయని శ్రీనివాస్ తెలిపారు. సీట్ల కోసం గొడవ పడుతున్నామనే సంకేతాలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇప్పుడే కాదు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ కలిసే వెళ్తామని అన్నారు. మా కూటమి రెండు రోజుల్లో ఒకే జాబితా ప్రకటిస్తోందని చెప్పారు.

ఫ్రెండ్లీ కాంటెస్ట్‌కు తావులేదు : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తున్నామని బలంగా ఉన్నచోట గెలవాలని చంద్రబాబు చెప్పారని బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. ఎవరి మనోభావాలూ దెబ్బతినకుండా ముందుకెళ్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల్లో సింగిల్ అజెండాతోనే పోటీ చేస్తున్నామని టీడీపీ, జనసేన చర్చల్లో ఏకాభిప్రాయం కుదిరిందని తెలిపారు. స్థానిక పరిస్థితుల మేరకు ఎవరు పోటీ చేయాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇన్ని సీట్లలో పోటీ చేయాలని ఇంకా లెక్కలేమీ వేసుకోలేదని ఫ్రెండ్లీ కాంటెస్ట్‌కు తావులేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

అధినేత పవన్ కల్యాణ్ చెప్పినట్లు క్యాడర్ సంతృప్తి చెందేలా పోటీ ఉంటుందని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఎవరు ఎక్కడ పోటీ చేయాలనే దానిపై మూడు పార్టీలకు స్పష్టత ఉందని అన్నారు. దీంతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లయింది. చర్చల దశ దాటి ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనకు కూటమి సిద్ధమవుతోంది.

చంద్రబాబుతో బీజేపీ నేతలు భేటీ : సీఎం చంద్రబాబుతో బీజేపీ నేతలు సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రితో పాటు సమన్వయ కమిటీ సభ్యులతో చర్చలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసే స్థానాలపై ప్రధానంగా చర్చించారు. దీంతో టీడీపీ, జనసేన మధ్య సర్దుబాటుతో పాటు బీజేపీకి కేటాయించే స్థానాలపైనా కసరత్తు సాగింది. మొత్తంగా, కూటమిలో సీట్ల సర్దుబాటు చర్చలు ప్రకటనల దశకు చేరాయి. మూడు పార్టీల మధ్య సమన్వయం, క్యాడర్ సంతృప్తి, ఉమ్మడి అభ్యర్థుల ఎంపిక ఇప్పుడు కీలకంగా మారాయి.

# ఎన్నికలకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి

## తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు..

## విశాఖ పోలీస్ కమిషనర్ హెచ్చరిక

## కొబ్బరితోటలో పోలీసుల ముఖాముఖి కార్యక్రమం

విశాఖపట్నం, అక్టోబర్ 14, జయ జయహే

రానున్న జీవీఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కోరారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కొబ్బరితోట ప్రాంతంలో బుధవారం సాయంత్రం టూటౌన్ సీఐ బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పోలీస్




కమిషనర్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల సహకారం ఎంతో ముఖ్యమన్నారు.

**అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా**

కొబ్బరితోట ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని సీపీ తెలిపారు. రౌడీషీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు.

**సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు**

ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం, ప్రజలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ బి. అప్పలనాయుడు, ఎస్ఐలు మన్మధరావు, శ్రీలక్ష్మి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# డీఎస్పీ పావనిని కలిసిన కాంగ్రెస్ నేతలు

## బాలికల కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని వినతి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే

శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావనిని కాంగ్రెస్ నాయకులు తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు అధికంగా ఉన్నాయని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, స్వర్ణముఖి కట్ట ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వివరించి, వాటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఎస్పీ పావని సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధా యాదవ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రెస్ క్లబ్ ఆధునికీకరణకు రూ.10 లక్షలు!

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేతుల మీదుగా మంజూరు పత్రాల అందజేత.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్ 14

:సమాజాభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. నగర అభివృద్ధి కోసం తనకు కేటాయించిన రూ.కోటి నిధుల్లో తొలి ప్రాధాన్యంగా ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ భవన ఆధునికీకరణకు రూ.10 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. బుధవారం ఉదయం ప్రెస్ క్లబ్ ఆవరణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, క్లబ్ కార్యవర్గానికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలతో పాటు సమాజానికి సేవలందించే సంస్థల అభివృద్ధికి నిధులు వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మరో రూ.10 లక్షలను ఎన్జీవో సంఘానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ భవనాన్ని ఆధునికీకరించుకొని, జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సమసమాజ స్థాపనలో తమవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం వీఎల్ పురంలోని లారీల స్టాండ్ ప్రాంగణంలోనూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతా బాల విజయ సారధి, కార్యదర్శి గంద్రోతు వేణుగోపాలస్వామి (గోపి), ఉపాధ్యక్షులు పెచ్చేటి శ్రీనివాస్ గంగాధర్, కొత్తపల్లి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శులు సోమాబత్తుల కృపానందం, కరుటూరి వెంకట నాగేంద్ర వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాసరావు (ఈశ్వర్), కొట్టే మధు, రాజనాల వి.వి. సత్యనారాయణ, పాతగొలుసు చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్, గుడిపూడి గోపాలకృష్ణ, గరగ వి.వి. ప్రసాద్ పాల్గొన్నారు. మాజీ గౌరవ అధ్యక్షుడు మండేల శ్రీరామమూర్తి, మాజీ అధ్యక్షులు కుడిపూడి పార్థసారధి, కందవల్లి శ్రీనివాస్, కె. రాజబాబు, అయ్యప్పస్వామి, ఫోటోగ్రాఫర్ బాబి, వీవీ రామకృష్ణ, విశ్వనాథ్, శివన్నారాయణ, కళాధర్, రాఘవరావు, ఎబిఎన్ సతీష్, కెమెరామెన్ వాసు, నాని, వెలుగూరి రవికుమార్,ఎబిసి కిషోర్, ఆనంద్, వెంకటరమణ, రాజా, గుత్తుల మురళి, సూరంపూడి వెంకటరావు, తలుపులరావు, డి. శ్రీనివాస్, యర్రా బాబి, పురుషోత్తం, బూడిద వీర్రాజు, దాసరి రాము, పెంకే శ్రీను, భూషణం, పితాని రవి, ఎన్. శ్రీనివాస్, విశాలాక్షి, రమేష్, నాగరాజు, నరేష్, యాకూబ్, పళ్ళా సత్యనారాయణ తదితర ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# సింహ వాహనంపై యోగ నరసింహుని అలంకారంలో మలయప్పస్వామి

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన బుధవారం ఉదయం మలయప్పస్వామి సింహ వాహనంపై యోగ నరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సింహ వాహనంపై కొలువుదీరిన స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణలతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముందుగా గజరాజులు గంభీరంగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కన్నులపండువగా జరిగింది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com